జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com


# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

బుధవారం | 26-11-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 521 పేజీలు: 4 వెల : రూ.7

# ఏకీకృత భారత రూపశిల్పి వల్లభాయ్ పటేల్



- ✱ పటేల్ చేసిన సేవలు యువతకు తెలియాలి
- ✱ ఐక్యతా యాత్ర ఉత్తరాంధ్ర కన్వీనర్, ఎచ్చెర్ల శాసన సభ్యులు ఈశ్వరరావు
- ✱ యువత దేశానికి అండగా నిలవాలి
- ✱ పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు
- ✱ పాతపట్నంలో జాతీయ సమైక్యత ర్యాలీ
- ✱ తరలివచ్చిన నేతలు, యువత





**పాతపట్నం, నవంబరు25 (వార్త):** ఏకీకృత భారత రూపశిల్పి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఐక్యతా యాత్ర ఉత్తరాంధ్ర కన్వీనర్, ఎచ్చెర్ల శాసన సభ్యులు నడికుదిటి ఈశ్వరరావు వెల్లడించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు యువతకు తెలియజేసేందుకే ఈ ఐక్యతా యాత్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా కొనసాగుతున్న స్ఫూర్తి కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఉదయం పాతపట్నంలో మూడో విడత జాతీయ సమైక్యత ర్యాలీ నిర్వహించారు. నీలమణి దుర్గ గుడి నుంచి కె.యస్.ఎమ్ ఫంక్షన్ హాల్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ మేరా యువ భారత్, జాతీయ సేవా పథకం జిల్లా శాఖలు సంయుక్తంగా ఈ ర్యాలీని చేపట్టారు. అనంతరం కె.యస్.ఎమ్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేమాతరం రచన జరిగి 150 వసంతాల సంబరాలు దేశవ్యాప్తంగా నిర్వహించుకుంటున్నామని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం తర్వాత దేశంలో 565 సంస్థానాల ఏకీకరణకు పటేల్ చేసిన కృషి వలన భారత్ నేడు సమైక్యంగా ఉందన్నారు. చదువుకున్న యువత విదేశాలకు వెళ్లకుండా వికసిత్ భారత్‌లో పాల్గొని దేశానికి అండగా నిలవాలని కోరారు. మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె. వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయింతి పురస్కరించుకొని ఆయా పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలో అక్టోబర్ 31వ తేదీ నుంచి నవంబరు 25వ తేదీ వరకూ విద్యార్థులకు, యువతకు భాగస్వామ్యం చేసి పలు రకాల కార్యక్రమాలు నిర్వహించాలని సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని, వందేమాతరం గేయాన్ని మన జీవనాడిగా చేసుకోవాలన్నారు.మేరా యువ భారత్ గణంకాధికారి, కార్యక్రమ సహాయకులు డి.శ్రీనివాసరావు ఆత్మ నిర్భయపై ఈ కార్యక్రమంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దంతులూరి వనజ, పాతపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.సన్యాసినాయుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె చక్రపతి, జాతీయ ఎస్ఎస్ఎస్ అవార్డు గ్రహీత ఆర్.లీలా ప్రసాద్ రెడ్డి, వివిధ కళాశాల ప్రిన్సిపాల్స్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు యువతీ యువకులు పాల్గొన్నారు.






# రిమ్స్‌లో డెలివర్రీ

✱ గైనిక్ వార్డుల్లో నార్మల్ ప్రసవాలు కన్నా సిజేరియన్లే అధికం ✱ నార్మల్‌కు ప్రాధాన్యమివ్వాలని చెబుతున్నా పట్టించుకోని ✱ కొందరు గైనికాలజిస్టులు ✱ రిమ్స్‌కు వచ్చిన గర్భిణీలకు తమ సొంత ఆసుపత్రులకు.. ✱ పీజీ ప్రాక్టికల్స్ సమయంలో పైసా వసూల్‌పై ఆరోపణలు ✱ ఎంతెంత కలెక్షన్ చేశారన్న దానిపై సామాజిక మాధ్యమాల్లో చాటింగ్ ✱ 'జాతీయ వార్త'లో త్వరలో సమగ్ర కథనం (శ్రీకాకుళం-వార్త)

## గర్భిణి మృతి

**శ్రీకాకుళం, నవంబర్ 25 (వార్త):** కంచిలి మండలం అర్జునాపురం గ్రామానికి చెందిన కాయ ధనలక్ష్మి (26) అనే గర్భిణి తీవ్ర అస్వస్థతకు గురై సోమవారం రాత్రి మృతి చెందింది. ఈ మేరకు కుటుంబ సభ్యులు, పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ధనలక్ష్మికి ఏడాది కిందట ఇచ్ఛాపురం మండలం మండపల్లికి చెందిన కాయ శివతో వివాహమైంది. ప్రస్తుతం ఆమె ఎనిమిది నెలల గర్భిణి. కాగా కన్నవారింట్లో ప్రస్తుతం తల్లిదండ్రులతో ఉంటోంది. సోమవారం రాత్రి భోజనం చేస్తుండగా ఆమె అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే సోంపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో మరో రెండు ఆసుపత్రులకు వెళ్లి అక్కడి నుంచి సుమారు రాత్రి 11 గంటల ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే ధనలక్ష్మి మృతి చెందినట్లు వైద్యుడు మూల జోగినాయుడు తెలిపారు. ఈ ఘటనపై సోంపేట ఎస్ఐ లవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గర్భిణీల పేర్లు నమోదు చేయాలి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.అనిత



**శ్రీకాకుళం,నవంబరు 25(వార్త):** గర్భిణీల పేర్లు నమోదు తప్పనిసరని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.అనిత తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి ఐ. విమల ఆధ్వర్యంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో ఇచ్ఛాపురం, సారవకోట, ఎల్.ఎన్.పేట మండలాలకు సంబంధించిన ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలతో గర్భిణీ సంరక్షణ, సురక్షిత ప్రసవాలు గూర్చి, అబార్షన్లపై, సమీక్షా సమావేశం మంగళవారం ఏర్పాటు చేశారు. గర్భిణీ మొదటి మూడు నెలలలోపు నమోదు చేసి, పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని, అబార్షన్ అయితే ఆర్.సి. హెచ్.నందు అప్లోడ్ చేయాలని, అబార్షన్ జరుగుటకు గల కారణాలను సేకరించి, తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మూడు మండలాలలో లింగ నిష్పత్తిపై వ్యత్యాసానికి గల కారణాలు గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మేరీ కేథరిన్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.రామ్‌ఎసు, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ నోడల్ అధికారిణి పి.మణెమ్మ, వైద్యాధికారులు, డిప్యూటీ డెమో కె. ఎర్రన్న, గణాంక విభాగం, డెమో విభాగం, సూపర్వైజర్లు, ఎ.ఎన్.ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 27న శాసన సభ అంచనాల కమిటీ జిల్లాకు రాక

**శ్రీకాకుళం, నవంబరు25(వార్త):** శాసన సభ అంచనాల కమిటీ ఈ నెల 27వ తేదీన శ్రీకాకుళం జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27వ తేదీన గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రోడ్డు మార్గాన విజయనగరం నుండి బయలు దేరి శ్రీకూర్మం చేరుకొని కూర్మనాథ స్వామి దేవాలయాన్ని సందర్శిస్తారు. అనంతరం అక్కడ నుండి బయలుదేరి శ్రీకాకుళంలోని ప్రభుత్వ అతిథి గృహంలో రాత్రి బస చేస్తారు. 28వ తేదీ ఉదయం 8 గంటలకు సూర్యనారాయణ స్వామి దేవాలయాన్ని సందర్శిస్తారు. అనంతరం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి అంచనాలను సమీక్షిస్తారన్నారు. అనంతరం రాత్రి 7.55 గంటలకు విజయవాడ బయలుదేరుతారు.

# స్థలం ఆక్రమించేసి.. ఆపై దౌర్జన్యం!

పలాసలో ఓ వ్యాపారిపై ప్రైవేటు వ్యక్తుల జులుం - జేసీబీతో తొక్కించేస్తామని బెదిరింపు - న్యాయం కోసం పోరాడుతానన్న వ్యాపారి తాలాసు ఈశ్వరరావు



**పలాస, నవంబరు 25 (వార్త):** పలాస నియోజకవర్గంలో కబ్జాకోరులు బరితెగిస్తున్నారు. తమది కాని భూమిని కబ్జా చేసి.. ఆ పై దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. భూమి యజమాని ఇదేంటని ప్రశ్నిస్తే జేసీబీతో తొక్కించేస్తామని ఏకంగా బెదిరింపులకు పాల్పడుతూ రౌడీయిజం చేస్తున్నారు. దీనిపై పోలీసుల దృష్టికి తీసుకువెళ్లినా సివిల్ మేటరంటూ చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే.. పలాన మండలం బొడ్డుపాడు రెవెన్యూ పరిధిలో ఉన్నటువంటి సర్వేనంబర్ 67/పిలో బుధవారం కొంతమంది ప్రైవేటు వ్యక్తులు జెసిబితో తమకు ఉన్న స్థలాన్ని కాకుండా ప్రక్క స్థలాలను చదునుచేసి ఇనుప స్తంభాలు వేసే ప్రక్రియను ప్రారంభించారు. దీన్ని తెలుసుకున్న ఆ స్థలం యజమాని తాలాసు ఈశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. అంతేగాకుండా స్థలం చదును చేయకుండా అడ్డుకున్నారు. 30 ఏళ్ళు క్రితం తాము సుబాష్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి పక్కా రిజిస్ట్రేషన్ తో పాసు పుస్తకాలు, 1బి లు కలిగి ఉన్నామని ఆక్రమణదారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్థలం నుంచి బయటకు వెళ్లకపోతే జేసీబీతో తొక్కి చంపేస్తామని హెచ్చరించారని తాళాను ఈశ్వరరావు మీడియా ముందు వాపోయారు. 2018 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం స్థలంతో పాటు పరిసర ప్రాంతంలో ప్రభుత్వ పెట్రోల్ బంకును ఏర్పాటు చేస్తామని అనడంతో మేము వే బ్రిడ్జి నిర్మాణానికి ఏర్పాట్లు చేసుకున్న స్థలం అప్పగించామని, అది ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో విడిచిపెట్టేశారని అన్నారు. అనంతరం స్థలాన్ని మేము స్వాదీనం చేసుకున్నామని, ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులు వచ్చి స్థలాన్ని అక్రమించుకుంటే ఎలా విడిచిపెడతామని అన్నారు. తమకు న్యాయం జరిగేవరకూ న్యాయ పోరాటం చేస్తానని, ఎమ్మెల్యే, తహశీల్దార్ దృష్టికి తీసుకువెళతానని ఈశ్వరరావు పేర్కొన్నాడు.

## రైతన్న అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**జి.సిగడాం, నవంబరు 25(వార్త):** రాష్ట్ర రైతులకు ఆర్థికంగా ఆదుకొని అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మండల టిడిపి అధ్యక్షులు కుమరాపు రవి కుమార్ తెలిపారు.మంగళవారం ఎందువ గ్రామంలో రెండవ రోజు రైతన్న మీకోసం వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలు లాంటివారని అన్నారు.రైతులకు ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యం వస్తున్నారని తెలిపారు.అన్నదాతల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు జోగినాయుడు, వెంకటరమణ,బోగాది అప్పలనాయుడు మండల వ్యవసాయ అధికారి బి. బాజ్జీ, శ్రీనివాసరావు, జక్కంపూడి దాసు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్రాక్షాయిణి, తదితరులు పాల్గొన్నారు.



## పీవీసీ విండోస్ తయారీ యూనిట్ ప్రారంభం



**సోంపేట, నవంబరు 25(వార్త):** పాలవలస గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన యూపీవీసీ విండోస్, డోర్స్ తయారీ యూనిట్ను ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్, పలాస ఎమ్మెల్యే గౌత శిరీష మంగళవారం ప్రారంభించారు. మారుమూల గ్రామాల్లో ఇటువంటి చిన్న తరహా పరిశ్రమల ద్వారా యువత ఉపాధి పొందే ప్రయత్నం చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. చదువుకున్న యువకులు కేవలం ఉద్యోగాల కోసమే వెంపర్లాడటం కన్నా ఇటువంటి స్వయం ఉపాధి పరిశ్రమలు నేలకొల్పి తద్వారా మంచి ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. వీటి ద్వారా మరి కొంతమందికి ఉపాధి కూడా కలుగుతుందని అన్నారు. ఇటువంటి పరిశ్రమలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కూడా ప్రభుత్వం కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొప్రైటర్ బేసి కిషోర్, విజయనగరం సిఐ బేసి లక్ష్మణరావు, మా కన్నపురం సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు, బేసి ఖగేశ్వరరావు, బురద విశ్వనాథం, రత్నాల వెంకటరమణ, తామాడ పాపారావు, మల్ల కోదండరావు, రామ్ బుడ్డి గణపతి, శిలగాన గణపతి, కె ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కొంచాడ కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ గిరిబాబు పరామర్శ



**పలాస, నవంబరు 25(వార్త):** కొంచాడ వైకుంఠరావు మృతిపై ప్రగాఢ సంతాపాన్ని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు వ్యక్తం చేశారు. ఆయన కుమారులు కాశీబుగ్గ వైశ్య సంఘం మాజీ ప్రెసిడెంట్ కొంచాడ రాజా శ్రీకాంత్, జర్నలిస్ట్ కొంచాడ రవిని మంగళవారం ఆయనతో పాటు ఎక్స్ ఎంపిటిసి మరడ భాస్కర్ రెడ్డి,పెద్దలు డబ్బేరు నాగభూషణం, వల్లభ వైకుంఠరావు, బడగల మధు తదితరులు పరామర్శించారు.

## ఘనంగా శ్రీరాముని శోభాయాత్ర




**సోంపేట, నవంబరు 25(వార్త):** సోంపేటలో రామ మాల ధరించిన భక్తులు, శివ స్వాములు, అయ్యప్ప భక్తులు కలిసి సోమవారం రాత్రి ఘనంగా శ్రీరాముని ఉత్సవమూర్తులు, శివలింగం ఊరేగింపుతో భారీ సౌభాయాత్రను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నేతాజీ నగర్ లో శ్రీరామ సన్నిధానం నుంచి పలు వీధుల గుండా చిన్న కోమటి వీధిలో శ్రీ కోదండరామ ఆలయం వరకు ఈ స్వభాయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సన్నిధానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం సాయంత్రం మొదలైన సౌభాయాత్ర దారి పొడవునా ఎంతో సందడిగా ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా శ్రీరామునిగా ముప్పన ఈశ్వరరావు, శివాజీ వేషధారణలో సురేంద్ర చౌదరి, రంగోలి ఉమామహేశ్వరి వేషధారణలతో ఎంతగానో అలరించారు. అంతకుముందు సన్నిధానం వద్ద అన్న ప్రసాద వితరణ జరిగింది. రామ్ మాల ధరించిన భక్తులు తెప్పల రవి, టీ ధర్మరాజు, టి కృష్ణారావు ఆర్ హేమంత్ , కే విశ్వేశ్వరరావు తదితరులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.


## సుబ్రహ్మణ్యేశ్వర కళ్యాణానికి రండి



**పలాస, నవంబరు 25(వార్త):** మాజీమంత్రి గౌతు శ్యామ్ సుందర్ శివాజీ దంపతులను శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర కళ్యాణ మహోత్సవ ఆహ్వానము పలికారు. శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర స్వామి వారి దేవాలయం రెడ్డికి వీధి గ్రామం పలాస నందు 26వ తేదీ బుధవారం ఉదయం 4. 30 నిమిషాలకు శ్రీశ్రీశ్రీ వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూలవిరాట్ కు పంచామృత అభిషేకాలు జరుపబడును. మధ్యాహ్నం అన్న ప్రసాదం మరియు సాయంత్రం ఐదు గంటలకు స్వామి వారి కళ్యాణం చేయుటకు కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ కార్యక్రమం ఆలయ ధర్మకర్తలు శాసన పూరి మురళీకృష్ణ, మాధురి దంపతులుచే జరిపిస్తారని, సదరు కార్యక్రమానికి మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, విజయమ్మ దంపతులను ఆహ్వానించారు.

## విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించిన ఎంఈఓ

**జలుమూరు, నవంబరు 25(వార్త):** ఈదులవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను ఎంఈఓ 2ఎంవీఎస్ ప్రసాద్ రావు పరిశీలించారు. మంగళవారం స్థానిక పాఠశాలకు చేరుకున్న ఆయన జామెట్రీలో చేపడుతున్న అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాటి వివరాలను సులువుగా నేర్చుకునే పద్ధతులను విద్యార్థులకు తెలియజేశారు. లెక్కలలో తగిన శ్రద్ధ చూపితే మంచి మార్కులు సాధించవచ్చునని సూచించారు. ఉపాధ్యాయుడు కృష్ణ తేజ పాల్గొన్నారు.



# పచ్చని ఉద్దానాన్ని అధ్వానం చేయవద్దు

### -కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్ణయాన్ని రద్దు చెయ్యాలి
### -బిడిమిలో బాధిత రైతుల ర్యాలీ, నిరసన




**మందస, నవంబరు 25(వార్త):** పచ్చని ఉద్దానాన్ని అధ్వానం చేయవద్దని, కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చెయ్యాలంటూ బిడిమిలో బాధిత రైతులు ర్యాలీ, నిరసన చేశారు. కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు కొమర వాసు ఆధ్వర్యంలో బాధిత రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బాధిత రైతులంతా కలిసి పలాస ఆర్డీఓ కార్యాలయం వద్ద మహాధర్నా చేసి, మా పచ్చని ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణం వద్దని వినతిపత్రం ఇస్తామంటే, పోలీసులు నిర్బంధం విధించి.. రైతులుకు అవకాశం ఇవ్వలేదన్నారు. ఈ నెల 21నుంచి 26వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలతో ప్రభుత్వంపై నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా, శాంతియుతంగా పోరాటం చేస్తున్న సరే మా మనోభావాలు దెబ్బతినేలా చేస్తున్నారన్నారు. దీన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇక నుంచి బాధిత రైతులు చేస్తున్న ప్రజా పోరాటంపై కూడా తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని గట్టిగా హెచ్చరిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా గత సంవత్సరం కాలం నుంచి రాజ్యాంగ బద్ధంగా చేస్తున్న ఈ ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి తెలియజేస్తున్నామన్నారు. బాధిత రైతులు అనుమతి లేనిదే మా భూముల్లో అడుగు పెట్టారదని హెచ్చరించారు. కార్యక్రమంలో దున్న హరికృష్ణ, తెప్పల గున్నయ్య, ఇరోతు కృష్ణా రావు, జుత్తు నారాయణ, జుత్తు కోటేష్, జుత్తు చంద్రమ్మ, గుంటు లోకనాథం, జుత్తు ధర్మరాజు, తిమ్మల రాములమ్మ, మెట్టూరి లక్ష్మి తదితర మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**మందస, నవంబరు 25(వార్త):** రాష్ట్రంలో రైతును రాజుగా మార్చాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష అన్నారు. మందస మండలంలోని అంబుగాంలో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి రైతులతో మాట్లాడారు. రైతులు ఆధునిక వ్యవసాయం మెళుకువలు నేర్చుకోవాలని, లాభసాటి వ్యవసాయ పద్ధతిలో రైతులు ముందుకు వెళ్లాలని కోరారు. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని, ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, తహసీల్దార్ మిస్క శ్రీకాంత్, ఎంపీడీఓ వై.వెంకటరమణ, ఏఓ జి.నాగరాజు, తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి తాతారావు, మందస, బాలిగాం పీఏసీఎస్ ల చైర్మన్లు తమిరియా భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, ముడిముంచి నవీన్ కుమార్ యాదవ్, సాలీన మాధవరావు, చౌదరి మురళీకృష్ణ, బత్తిన తారక్, మండల లచ్చయ్య, సచివాలయం సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు పలాస విద్యార్థులు



**పలాస, నవంబరు 25(వార్త):** ఈనెల 21,22 తేదీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సొండిపూడి (మందస మండలం) లో జరిగిన 37వ అంతర్ జిల్లాల బాలబాలికల టెన్నికాయిట్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టులో పాల్గొన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల పలాస క్రీడాకారులు బాలుర విభాగంలో కొరికాన జయంత్ కు,బాలికల విభాగంలో నెయ్యిల దివ్య కు మూడో స్థానం వచ్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రవికుమార్ తెలియజేశారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య, బి.శంకర్రావు, ఆర్ శ్రీనివాసరావు, క్రీడాకారులను పాఠశాల ఉపాధ్యాయులు పి.కృష్ణారావు, ఆర్.సోమేశ్వరరావు, ఎస్.సోనియా, చక్రపాణి ప్రదాన్, ఎస్.త్రిలోచనరావు, పీఎంసీ చైర్మన్ కే.తారక్, తదితరులు అభినందించారు.

## మందసలో న్యాయవిజ్ఞాన సదస్సు




**మందస, నవంబరు 25(వార్త):** రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ(అమరావతి), జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ(శ్రీకాకుళం) ఆదేశాల మేరకు మండల న్యాయ సేవ సంఘం అధ్యక్షుడు, ఆరవ అదనపు జిల్లాజడ్జి(సోంపేట) కోడూరు కిషోర్ బాబు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఇంటర్నేషనల్ డే ఫర్ ది ఎలిమినేషన్ ఆఫ్ వైలెన్స్ ఎగనిస్ట్ ఉమెన్(మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం)సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడవారిపై ఇంతకుముందు మానసికంగా, శారీరకంగా హింసలు జరిగేవని, ఇప్పుడు టెక్నాలజీ పెరిగిన కారణంగా సాంకేతికంగా కూడా ఆడవారిపై హింసలు జరుగుతున్నాయన్నారు. వీటన్నిటిని నిర్మూలించాలంటే మహిళలు ఇటువంటి హింసలకు వ్యతిరేకించవలసి ఉంటుందని, అంతేకాకుండా ప్రతీ ఒక్కరూ కలసికట్టుగా వ్యతిరేకించాలన్నారు. ఎటువంటి హింసైన ఎవరిపై జరిగినా మరొకరు ఆ జరిగిన ప్రతీ ఒక్క స్త్రీ ఎదురునిలిచి వ్యతిరేకించాలన్నారు. దీంతోనే మహిళలపై జరుగుతున్న హింసలు నిర్మూలించగలుగుతారన్నారు. ఈ అగత్యాలకు గృహహింస చట్టం, పోక్సో చట్టాలు నిర్మించబడ్డాయన్నారు. న్యాయవాదులు ఎం.సర్వేశ్వరరావు, వై.కృష్ణమోహన్, జి.పున్నయ్య, ఎంసీహెచ్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ వై.వెంకటరమణ, డ్వాక్రా మహిళలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



## రోడ్లు ఆక్రమణులు తొలగించాలి

### - పలాస మున్సిపల్ చైర్మన్, కమిషనర్ పరిశీలన



**పలాస, నవంబరు 25(వార్త):** పలాస మున్సిపాలిటీలో రహదారులపై ఉన్న అక్రమణులు తొలగించాలని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉదయం 7:30 గంటలకు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబులు కేటి రోడ్లో ఫీల్డ్ ఇన్స్పెక్షన్ చేసి ట్రాఫిక్ కి ఎటువంటి ఇబ్బందులు లేకుండా రోడ్డుపై ఉన్న చిల్లర కొట్టులను, ఆక్రమణను తొలగించి, చెత్తను రోడ్లపై వేయకుండా ప్రజలకు షాపులు యజమానులకు అవగాహన కల్పిస్తూ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ సుందరంగా తయారు చేయాలంటే ఆక్రమణలు తొలగించాలని విజ్ఞప్తి చేశారు. చెత్త చెదారం బయటి వెయ్యకుండా మున్సిపాలిటీ సిబ్బందికి అందజేయాలని కోరారు. ఆక్రమణలు తొలగించకపోతే వారికి చట్టపరమైన శిక్షలు తప్పని హెచ్చరించారు. మున్సిపాలిటీ రహదారులు ఇరుకుగా ఉండడంతో రహదారులపైనే చిల్లర దుకాణాలు, తోపుడు బళ్ళు వాటితో ఎప్పటికైనా ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సానిటరీ ఇన్స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల ఆందోళనకు వైసీపీ మద్దతు

### -లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలి
### -కార్మిక చట్టాలను సంస్కరణల పేరుతో హక్కుల కోత
### -జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ధ్వజం

**పలాస, నవంబరు 25(వార్త):** స్వాతంత్రం అనంతరం కార్మికులు సాధించుకున్న హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని, ఇటీవల కార్మిక సంఘాలు, ప్రతిపక్షాల అభ్యంతరాలు, నిరసనలను నిర్లక్ష్యంగా పట్టించుకోకుండా లేబర్ కోడ్ లను తీసుకువచ్చినందుకు నిరసనగా దేశవ్యాప్తంగా 10 కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 26వ తేదీన చేపట్టనున్న ఆందోళనకు వైయస్సార్ ట్రేడ్ యూనియన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. మంగళవారం ఆయన పలాసలో మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను ఏకపక్షంగా ప్రకటించడానికి దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఈ లేబర్ కోడ్ ల వల్ల కార్మిక సంఘాలు సుదీర్ఘ పోరాటాల ద్వారా ఎంతగానో కష్టపడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఈ చట్టాలు కొంతమేరకు కార్మికుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ వచ్చాయన్నారు. అనేక పరిమితులు ఉన్నప్పటికీ, వేతనాలు, పని గంటలు, సామాజిక భద్రత, పారిశ్రామిక భద్రత - తనిఖీ తదితర అంశాలు కొంతమేర కార్మికుల ప్రయోజనం ఈ చట్టాలు ఉపయోగపడ్డాయి అన్నారు. వీటిని కార్మికులకు మరింత అనుకూలంగా మార్చడానికి బదులుగా, కొత్త లేబర్ కోడ్ లు కార్మికుల హక్కులను నీరు కార్చే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ ల వలన ఉపాధి, పెట్టుబడులు పెరుగుతాయని ప్రభుత్వం చేస్తున్న వాదన పూర్తిగా నిరాధారమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పైగా ప్రభుత్వం రూపొందించిన కార్మిక చట్టాల వల్ల కార్మిక వర్గం సమ్మె చేసే హక్కును కోల్పోయిన పరిస్థితి లేకపోలేదు అన్నారు. గతంలో వాజ్ పేయి, కె. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రులుగా ఉన్న సమయంలో కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేయాలని చూస్తే దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమం నడిచిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో 85.96 లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులకు మోడీ తీసుకు రానున్న నూతన చట్టాలు ఇబ్బందికరంగా మారుతాయి అన్నారు. ఉద్యోగం భద్రత,సమాన పనికి సమాన వేతన చట్టాలు హరించే పరిస్థితి నెలకొంటుందని బమ్మిడి దుర్యోధనరావు ఆందోళన వ్యక్తం చేశారు. మన రాష్ట్రం విషయానికొస్తే కేంద్రంలో మోడీ ఏ విధానం అనుసరిస్తే రాష్ట్రంలో చంద్రబాబు అదే విధానాలను అనుసరిస్తున్నారని , కార్మిక వ్యతిరేక శక్తిగా చంద్రబాబు మారుతున్నారని బమ్మిడి దుర్యోధనరావు మండిపడ్డారు. మన రాష్ట్రంలో ఇటువంటి చట్టాలను తీసుకు రావడంతోనే 400 పైగా కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయని ఆయన గుర్తు చేశారు.మోడీ కార్మిక వ్యతిరేక విధానాలకు దేశవ్యాప్తంగా ఈనెల 26వ తేదీ అనగా బుధవారం కార్మికుల ఆందోళన కార్యక్రమం జరగనుందని, అందుకు వైయస్సార్ ట్రేడ్ యూనియన్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. రాష్ట్రంలో జరిగే ఆందోళనలో కార్మికులతో కలిసి పాల్గొంటామని, కార్మికులకు అండగా ఉంటామని అన్నారు.కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా కొనసాగిన వైఖరి చరిత్రలో లేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ తీరు మార్చుకోవాలని బమ్మిడి దుర్యోధనరావు హితవు పలికారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడి మృతి

**మందస, నవంబరు 25(వార్త):** మూడు చక్రాల వాహనం బోల్తా పడడంతో ఓ దివ్యాంగుడు మరణించాడు. ప్రమాదం చిన్నదే భావించినప్పటికీ.. ఓ వ్యక్తి ప్రాణాలు తీసింది. మందస మండలంలోని వీరగున్నమ్మపురం గ్రామానికి చెందిన యర్ర సింహాచలం మృతి చెందాడు. పుట్టుకతోనే పోలియో సోకడంతో ఆయన రెండు కాళ్లూ పని చేయకపోవడంతో మూడు చక్రాల స్కూటీపై తిరుగుతుంటారు. విద్యార్థులకు ట్యూషన్లు చెబుతూ జీవనం సాగిస్తున్న సింహాచలం తన వాహనంపై కొర్రాయిగేటు వైపు వెళ్తుండగా.. కుంటికోట సమీపంలోని వైటీసీ వద్ద మూడు చక్రాల వాహనం రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. ప్రమాదంలో సింహాచలం తలకు తీవ్ర గాయం కాగా, తీవ్ర రక్తస్రావం జరిగింది. సమాచారం అందుకున్న మందస 108 వాహనం సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని, హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. చికిత్స అందించడానికి వైద్యులు పరీక్షలు జరుపగా.. అప్పటికే సింహాచలం మరణించినట్టు గుర్తించారు.

మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. సింహాచలం మృతితో ఆయన భార్య రూప మున్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

# మహిళా రక్షణ కోసం ఎన్నో చట్టాలు

### -జూనియర్ సివిల్ జడ్జి మాధురి





**పలాస, నవంబరు 25(వార్త):** మహిళా రక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని గౌరవ పలాస మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, పలాస జూనియర్ డివిజన్ సివిల్ జడ్జి యూ మాధురి అన్నారు. గౌరవ రాష్ట్ర, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ల వారి ఆదేశాలపై మంగళ వారం పలాస కోర్టు ఆవరణలో మహిళలపై అత్యాచార నిరోధక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో రకాలైన చట్టములు మహిళల రక్షణకై ఉన్నాయని, వరకట్న నిషేధ చట్టం, గృహహింస నిరోధక చట్టం, మనోవర్తి చట్టం తదితర చట్టాలు ఉన్నప్పటికీ మహిళలు చాలామందికి చట్టాలపై సరైన అవగాహన లేక పోవడం వల్ల వారు ఇబ్బందులకు గురి అవుతున్నారని, విద్యాసంస్థలలోనూ, గ్రామీణ ప్రాంతాలలోనూ, ఇతర పని చేసే స్థలాలలోనూ బాలికలు మహిళలు పట్ల గౌరవంతో ఉండడం ద్వారా, బాలికలకు స్త్రీలకు సమచిత మర్యాద గౌరవం ఇవ్వడం ద్వారా ఇటువంటి అత్యాచారాలు జరగకుండా కూడా చూడవచ్చని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరు ఇటువంటి అత్యాచారాలు జరగకుండా తమ వంతుగా కృషి చేయడం వల్ల సమాజానికి మంచి జరుగుతుందని మహిళల అభివృద్ధి సాధ్యమై వారు అన్యాయాలకు గురికాకుండా ఉంటారని తెలిపారు. మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులో వున్నదని తెలిపారు. డిసెంబర్ 13వ తేదీన జరగబోయే జాతీయ లోకదాలత్ లో ఎక్కువ సంఖ్యలో పెండింగ్లో గల కేసులు రాజీ చేసుకోవాలని, న్యాయవాదులు, పోలీసు అధికారులు, ఎక్సైజ్ అధికారులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వారికి గల కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమేష్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు మహమ్మద్ ఫియాజ్ అహ్మద్, ఉపాధ్యక్షులు బి.కామేశ్వరరావు పట్నాయక్, సీనియర్ న్యాయవాదులు జి. ప్రభాకర్‌రావు, వీ. రవి, జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్ అనిల్‌రాజు, పి.చిట్టిబాబు, కాశీబుగ్గ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. తిరుపతి, కాశిబుగ్గ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్, ఏఎస్ఐ ఏం.గోవిందరాజు పోలీసు సిబ్బంది, ఎక్సైజ్ సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రైతే దేశానికి వెన్నెముక

### -ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



**సారవకోట, నవంబరు 25(వార్త):** బుడితి లక్ష్మీపురం గ్రామంలో జరిగిన "రైతన్నా మీ కోసం" కార్యక్రమంలో శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని అక్కడి రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నదాతలకు నమస్కారాలు తెలుపుతూ "వ్యవసాయం రాష్ట్రానికి బలం%ొ% నేను కూడా రైతు బిడ్డనే. రైతు సమస్యలు నాకు తెలుసు. అందుకే రైతును రాజును చేయడం కూటమి ప్రభుత్వం ధ్యేయం" అని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్య కార్యక్రమాలను సంక్షిప్తంగా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, సారవకోట పిఎసిఎస్ అధ్యక్షులు సురవరపు తిరుపతిరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, క్లస్టర్ ఇంచార్జ్ పట్ట ఉమామహేశ్వరరావు, పర్లాం వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ వైస్ చైర్మన్ పొదిలాపు వేణుగోపాలరావు, సర్పంచ్లు పొదిలాపు కృష పొన్నాన శంకరరావు తర్ర లచ్చుము, మెండ మురళి, నిక్కు జనార్ధన, బోర ధనుంజయ్, శిమ్మ రామకృష్ణ, పిళ్ళా నందు కిషోర్, ఇసా నాగరాజు మరియు తహశీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నైపుణ్యం ఉంటేనే యువతకు ఉపాధి అవకాశాలు



**పలాస, నవంబరు 25(వార్త):** నేటి ప్రపంచీకరణ యుగంలో నైపుణ్యాభివృద్ధి ఉంటేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు యువతకు లభ్యమవుతాయని పలాస పిఎసిఎస్ పూర్వ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ ( బాబా), పలాస కార్మిక సంఘాల గౌరవ అధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్ సంయుక్తంగా పేర్కొన్నారు. మంగళవారం పలాస- కాశిబుగ్గ పురపాల సంఘం పరిధిలో గల కోసంగిపురం వద్ద నూతనంగా నిర్మించిన ' శివరామ టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్ట్యూట్ ' దువ్వాడ సోదరులు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా దువ్వాడ సోదరులు మాట్లాడుతూ.. ప్రపంచంలో కార్మికుల కొరత ఉందని, ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అగ్రశ్రేణి టాలెంట్ హబ్ గా ఎదగడానికి మన దేశానికి చాలా అవకాశాలు ఉన్నాయని, అయితే స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మిక శక్తి అవసరమని వారు తెలిపారు. రానున్న రెండు దశాబ్దాలు తర్వాత ప్రపంచ కార్మిక కొరత తీవ్రం కానుందని, యువ జనాభా, పెరుగుతున్న శ్రామిక శక్తితో భారతదేశం బలమైన స్థితిలో ఈ అంతరాన్ని పూరించడంలో ముందు వరుసలో ఉండే అవకాశాలు ఉన్నాయన్నారు. మూలపేట ఓడరేవు పూర్తి అయితే శ్రీకాకుళం జిల్లా గొప్ప పారిశ్రామిక ప్రాంతంగా బాసిల్లే అవకాశం ఉందని, ముఖ్యంగా పలాస, టెక్కలి నియోజకవర్గా లలో అనేకం పరిశ్రమలు నెలకొల్పేందుకు పెట్టుబడిదారులు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రధానంగా ఉద్దానంలో యువత వలసలు పోవడం పరిపాటిగా మారిందని, అయితే యువత నైపుణ్య అభివృద్ధిలో శిక్షణ పొందితే మంచి ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని దువ్వాడ శ్రీధర్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో శివ, వల్లభ రావు, నక్క అనిల్, సాయి వర్ధన్, రామారావు, రవి తదితరులు పాల్గొన్నారు.



## ఆధునిక వ్యవసాయ మెలకువలు నేర్చుకోవాలి



**పలాస, నవంబరు 25(వార్త):** రాష్ట్రంలో రైతును రాజుగా మార్చాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పలాస మండలం మంగళవారంగురుదాసుపురంలో ఇంటింటికి వెళ్లి రైతులతో మాట్లాడారు . రైతులు ఆధునిక వ్యవసాయం మెలకువలు నేర్చుకోవాలని,లాభసాటి వ్యవసాయ పద్ధతిలో రైతులు ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే కోరారు. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని, ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఉపయోగించుకోవాలని కోరారు.

కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, పలాస తాసిల్దార్ టి కళ్యాణ చక్రవర్తి, ఎంపీడీవో వసంత్ కుమార్, వ్యవసాయ అధికారి పోలరావు, యూనిట్ కన్వీనర్స్ పుచ్చ భాస్కరరావు, కుత్తుమ్ ప్రకాశరావు, తెలుగుయువత అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు, గ్రామపార్టీ అధ్యక్షులు మల్లెన శ్రీను, కార్యదర్శి శంకర్, సీనియర్ నాయకులు గోరకల దాసు, బైనపల్లి లోకనాథం, రేయ్య తిరుపతి, సాలిన ప్రవీణ్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరికివలసలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



**సంతబొమ్మాళి, నవంబరు 25(వార్త):** ఆరికివలస ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం దుప్పట్లు పంపిణి చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ తల్లి సరస్వతమ్మ జ్ఞాపకార్థంగా 30 మంది విద్యార్థులకు దుప్పట్లను మండల విద్యాశాఖఅధికారి జలుమూరు చిన్నవాడు చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గున్న దండాసి పొన్నాడ రామారావు, పంగ మురళి, ఉపాధ్యాయులు హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నల శ్రేయస్సుకు ప్రభుత్వం ప్రాధాన్యత



**మందస, నవంబరు 25(వార్త):** రైతన్నల శ్రేయస్సుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన అన్నారు. మందస మండలంలోని వీరభద్ర గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దుర్యోధన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సాగు భూమి ఉన్న రైతు కుటుంబాలు అందరికీ అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ద్వారా రెండు విడతల్లో రూ.14000 వారి ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. డబ్బులు ఎవరికైన జమ కాకుంటే రైతు సేవా కేంద్రం లో నమోదు చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటినుండి రైతులకు సబ్సిడీపై యాంత్రీకరణ పరికరాలు ఇస్తున్నామన్నారు. రైతులు ధాన్యం ఇచ్చిన 24గంటల్లోనే డబ్బులు జమ అవుతున్నాయని, దళారీ వ్యవస్థ నిర్మూలనే చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. నిరుద్యోగులకు అండగాకూటమి ప్రభుత్వం ఉంటుందని, శాసనసభ్యురాలు గౌతు శిరీష నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. రైతులకు సకాలంలో సాగునీరు అందించిన ఘనత గౌతు శిరీషకు దక్కిందని తెలిపారు. విత్తనాలు ఎరువులు సకాలంలో అందించారని, పాడి రైతులకు గోకులాలు, పశువుల దాణా పంపిణీ, పశువుల ఆరోగ్య రక్షణకు సకాలంలో టీకాలు పంపిణీ చేయించారని, ఇది మన మంచి ప్రభుత్వమన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మామిడి తాతారావు, భావన ఢిల్లీశ్వరరావు, బదకల భాస్కరరావు, పాలిన తాతారావు, గున్న విక్రమ్, దాసరి లోకేష్, కొర్రాయి సుధీర్, సాంబమూర్తి, దాసరి ఈశ్వరరావు, బధకల బాలయ్య, డొక్కరి పున్నయ్య, శాంతమ్మ, రంభమ్మ, గీత, రైతులు సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంఆర్సీ కార్యాలయంలో తాగునీటి మోటారు చోరీకి యత్నం



**నరసన్నపేట, నవంబరు 25(వార్త):** నరసన్నపేటలోని ఎంఆర్సీ కార్యాలయానికి ఆనుకుని ఉన్న భవిత కేంద్రం వద్ద తాగునీటి మోటారు చోరీకి గుర్తు తెలియని వ్యక్తులు యత్నించారని ఎంఈఓ ఉప్పాడ శాంతారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం దీనిని గమనించిన ఎమ్మార్సీ సిబ్బంది ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారన్నారు. మోటార్కు ఆనుకుని ఉన్న పైపులను ధ్వంసం చేశారని ఆయన తెలియజేశారు. దీంతో మోటారును భద్రత చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.

## మడపాం వద్ద గంజాయితో ఒకరి అరెస్టు



**నరసన్నపేట, నవంబరు 25(వార్త):** మడపాం టోల్ ప్లాజా వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తి వద్ద తనిఖీ చేయగా 20 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ శేఖర్రావు తెలిపారు. మంగళవారం ఆయన స్టేషన్లో వివరాలు వెల్లడించారు. గంజాయి తరలిస్తున్న షేక్ రియాజ్ అహ్మద్ను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. అతను గతంలో ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. అనంతరం రిమాండ్కు తరలించాన్నారు.

## రూరల్ ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నేతలు




**ఇచ్ఛాపురం, నవంబరు 25(వార్త):** ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్ లో నూతనంగా భాద్యత లు చేపట్టిన ఎస్ ఐ జనార్దన్ రావు కి స్థానిక మండల టీడీపీ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలసి,శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎల్ పద్మనాభం,దక్కత ఢిల్లీరావు ( మాజీ ఎంపీపీ) , సెక్రెటరీ డి కామేశ్వరరావు, పి ఏ సి ఎస్ అధ్యక్షులు పి.బాబ్జీ, డి. శ్రీనివాస్ రావు,ఎస్ .సహదేవ్,ఎంసూర్యనారాయణ, డి.రామరావు, బి.రాజేంద్ర ప్రసాద్, యు.శంకర్ నారాయణ, కామరాజు,ఎ.ఈశ్వరరావు, కాళ్ళ గోపి, యువరాజు,ఆసి మాధవ్ బి.లోహి దాస్, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం కార్యక్రమంలో జేసీ



**నరసన్నపేట, నవంబరు 25(వార్త):** పెద్ద బొరిగివలస సచివాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ రైతన్నా మీకోసం కార్యక్రమానికి హాజరయ్యారు. మంగళవారం ఉదయం స్థానిక సచివాలయానికి చేరుకున్న ఆయన రైతులతో నేరుగా మాట్లాడారు. రైతులకు ఉన్న సమస్యల పట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్న ఈ కార్యక్రమంలో వాటిని పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. తహసీల్దార్ టి. సత్యనారాయణ ఉన్నారు.

## వీధుల్లో పేరుకుపోయిన చెత్త

**సారవకోట, నవంబరు 25(వార్త):** సారవకోటలోని పలు వీధుల్లో పేరుకుపోతున్న చెత్తతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రెల్లి వీధిలో చెత్త కుప్పలుగా పడిఉండడంతో పందులు, కుక్కలకు ఆవాసంగా మారింది. చెత్త సేకరణ బండి నిత్యం గ్రామంలో తిరుగుతున్నప్పటికీ వ్యర్థాలు ఇలా పడి ఉన్నాయి. దీనిపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

